సాక్షి
ఆదిలాబాద్
మంగళవారం । 6 । జూన్ । 2023



నష్టాల నుంచి లాభాల్లోకి..

నష్టాల్లో ఉన్న ఆర్టీసీ ఈ ఏడాది మే నెలలో లాభాల బాట పట్టింది. గతేడాది ఇదే నెలతో పోల్చితే రూ.7.87 కోట్ల ఆదాయంతో ప్రగతి చక్రం ముందుకు సాగింది. 8లో▸

'గ్రూప్-1' కంట్రోల్‌రూం ..

కైలాస్‌నగర్: ఈనెల 11న నిర్వహించనున్న గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్ష కోసం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ రాహుల్‌రాజ్ ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షకు సంబంధించిన సందేహాలు, సలహాలు, వివరాల కోసం అభ్యర్థులు టోల్‌ఫ్రీ నంబర్ 18004251939లో సంప్రదించాలని సూచించారు.

గరిష్టం/కనిష్టం
42.0/29.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండతీవ్రత పెరగనుంది. ఉక్కపోత ప్రభావం కనిపిస్తుంది.

న్యూస్‌రీల్

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



మొక్క నాటుతున్న జిల్లా జడ్జి వరప్రసాద్

ఆదిలాబాద్‌టౌన్: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని జిల్లా జడ్జి డాక్టర్ సీహెచ్. వీ ఆర్ఆర్ వరప్రసాద్ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా కోర్టు ఆవరణలో సోమవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ, మానవ మనుగడకు మొక్కలు ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా మొదటి అదనపు జడ్జి డాక్టర్ శివరాంప్రసా ద్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి క్షమాదేశ్ పాండే, సీనియర్ సివిల్ జడ్జి ప్రమీల జైన్, జూనియర్ సివిల్‌జడ్జి మంజుల సూర్యవా ర్,బార్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

నేడు సురక్ష ర్యాలీ



ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

ఆదిలాబాద్‌టౌన్: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది వేడుకల్లో భాగంగా మంగళవారం సురక్ష దినోత్సవం నిర్వహించనున్నట్లు ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని పోలీసు పరేడ్ మైదానంలో నిర్వహించనున్న వేడుకలకు ఏర్పాట్లను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం ప్రజల సంరక్షణ కోసం కల్పిస్తున్న వివిధ రకాల సేవలను ఇందులో వివరించనున్నట్లు తెలిపారు. అలాగే 14 రకాల వర్టికల్స్‌పై శకటాలతో భారీ ర్యాలీ చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. సాయంత్రం 7 గంటలకు పోలీసు పరేడ్ మైదానంలో జిల్లా ప్రజాప్రతినిధులు, అధికారుల సమక్షంలో కళాజాత బృందాల ప్రదర్శన ఉంటుందని తెలిపారు. అలాగే గత పదేళ్లలో వివిధ రంగాల్లో ఉత్తమ సేవలు అందించిన పోలీసులకు ప్రశంసపత్రాలు అందించనున్నట్లు చెప్పారు. ఎస్పీ వెంట డీఎస్పీ ఉమేందర్, సీఐ సత్యనారాయణ, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు వెంకటి, శ్రీపాల్, వంశీకృష్ణ తదితరులు ఉన్నారు.

నకిలీ విత్తనాలు అరికట్టాలి

ఎదులాపురం: వానాకాలం సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో రైతులు నకిలీ విత్తనాల బారిన పడకుండా జిల్లా వ్యవసాయ అధికారులు తగు చర్యలు తీసుకోవాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూసం సచిన్ ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. జిల్లాలో రైతులు ఎక్కువగా పత్తి, సోయా, మొక్కజొన్న సాగుచేస్తారని, ఈమేరకు ఆయా విత్తనాలు అందుబాటులో ఉంచాలని పేర్కొన్నారు. మారుమూల గ్రామీణ ప్రాంతాల్లో నకిలీ విత్తన కంపెనీ ఏజెంట్లు అమాయక ఆదివాసీలకు మాయమాటలు చెప్పిమోసం చేస్తున్నారని, వాటిని అరికట్టాలని డిమాండ్ చేశారు.



సీడ్స్ షాపులో విత్తనాలు కొనుగోలు చేస్తున్న రైతులు

కావాల్సింది..నో!



ఈ రైతు పేరు సోమ కృష్ణారెడ్డి. భీంపూర్ మండలం పిప్పల్‌కోటి గ్రామం. ఈయనకు ఏడెకరాల వ్యవసాయ భూమి ఉంది. గతేడాది డిమాండ్ గల పత్తి విత్తనాలు వేసి అధిక దిగుబడి సాధించాడు. ఈఏడాది కూడా అవే విత్తనాల కోసం మార్కెట్‌కు వెళితే లభ్యం కావడం లేదంటున్నాడు. వ్యాపారులు కొరత ఉందంటున్నారని చెబుతున్నాడు. తెలిసిన రైతులకు మాత్రం అధిక ధరకు విక్రయిస్తూ వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నట్లు ఆరోపిస్తున్నాడు.



ఈ రైతు పేరు రెహన్‌ఖాన్. మహారాష్ట్రలోని దర్వ తాలుకా పల్సి గ్రామం. అక్కడ కొనుగోలు చేసిన విత్తనాలకు జర్మినేషన్ రావడం లేదని, దిగుబడి కూడా బాగా ఉండడం లేదని చెబుతున్నాడు ఈయన. ఇక్కడ క్వాలిటీ విత్తనాలు ఉండడంతో కొనుగోలు చేస్తున్నామని పేర్కొంటున్నాడు.

- విత్తన వ్యాపారుల మాయాజాలం
- డిమాండ్ ఉన్న వాటికి కృత్రిమ కొరత
- మనోళ్లకు నో.. 'మహా' వాళ్లకు మాత్రం అధిక ధరకు విక్రయం
- వానాకాలం ముందే జిల్లాలో పత్తి రైతు అగచాట్లు

సాక్షి,ఆదిలాబాద్: వానాకాలం పంటల సాగుకు ముందే రైతులకు అగచాట్లు మొదలయ్యాయి. విత్తన వ్యాపారుల మాయాజాలంతో తిప్పలు తప్పట్లేదు. ఈ సీజన్‌లో జిల్లాలో అత్యధికంగా సాగయ్యేది పత్తి. అయితే సరైన జర్మినేషన్, దిగుబడి ఇస్తుందని ఆశించిన పలు రకాల విత్తనాల కొనుగోలు కోసం మార్కెట్‌కు వస్తున్న రైతులకు అవి దక్కడం లేదు. షార్టేజ్ ఉందంటూ వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టిస్తున్నారు. ఆ డిమాండ్ రకాలను అధిక ధరకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

పరిస్థితి ఇలా..

జిల్లాలో ఈ వానాకాలంలో మూడున్నర లక్షల ఎకరాల్లో పత్తి పంట సాగవుతుందని వ్యవసాయ శాఖ అంచనా వేస్తుంది. ఇందు కోసం ఏడు లక్షల విత్తన ప్యాకెట్లు అవసరమని చెబుతున్నారు. 475 గ్రాములు ఉండే పత్తి విత్తన ప్యాకెట్‌ను రూ.853కు మార్కెట్లో విక్రయించాలి. అయితే రైతులు కొన్ని డిమాండ్ ఉన్న వెరైటీలను కొనుగోలు చేసేందుకు వస్తుండగా, అవి లేవని వ్యాపారులు చెబుతున్నారు. ఒకవేళ ఆ వెరైటీని తక్కువ ప్యాకెట్లు ఇచ్చి ఇతరత్రా రకాలను రైతులకు అంటగట్టడం ద్వారా వ్యాపారులు తమ స్వప్రయోజనం చూసుకుంటున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

మహారాష్ట్ర రైతులకు విక్రయం..

డిమాండ్ ఉన్న రకాల విత్తనాల కొరత ఉందంటూ వ్యాపారులు మాయాజాలం ప్రదర్శిస్తున్నారు. మన ప్రాంత రైతులకు వాటిని విక్రయించడం లేదు. అయితే మహారాష్ట్ర రైతులకు మాత్రం వీటిని అధిక ధరకు విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ ఏడాది 'మహా' రైతులు భారీగా ఇక్కడి నుంచే కొనుగోలు చేస్తుండడంతో మున్ముందు పత్తి విత్తనాల బ్యాగుల కొరత ఏర్పడే ఆస్కారం లేకపోలేదు. కాగా డిమాండ్ రకాలను మహారాష్ట్ర రైతులకు, కొంతమంది తెలిసిన వారికి రూ.వెయ్యి నుంచి రూ.1100 వరకు హెచ్చించి విక్రయిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఒకవేళ మన ప్రాంత రైతులకు ఈ ధరకు అమ్మితే పెద్ద ఎత్తున విమర్శలు వస్తాయని వ్యాపారులు 'మహా'తంత్రం ప్రదర్శిన్నారు. ఇక్కడి రైతులకు ఒకటి అరా మంచి విత్తనాలు ఇస్తూ మిగతా ఇతర రకాలను అంటగడుతున్నారు. దీంతో పలువురు రైతులు ఆ విత్తనాలను తీసుకోవడం లేదు. ఇదేమి అన్యాయమంటూ వాపోతున్నారు. ఈ దోపిడీని అరికట్టాలని రైతులు కోరుతున్నారు.

సరిపడా విత్తన ప్యాకెట్లు అందుబాటులో..



జిల్లా రైతులకు సరిపోయేంత పత్తి విత్తన ప్యాకెట్లు మార్కెట్లో అందుబాటులో ఉన్నాయి. డిమాండ్ రకాలతో పాటు కొన్ని ఇతరత్రా రకాలు కూడా రైతులకు ఇవ్వడం జరుగుతుంది. సరిహద్దులో ఉన్న మహారాష్ట్ర రైతులు ఏటా ఈ మార్కెట్లో విత్తనాలు కొనుగోలు చేస్తారు. విత్తన ప్యాకెట్లపై అధిక ధరతో విక్రయిసున్నట్లు మా దృష్టికి రాలేదు.

– పుల్లయ్య, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి

'విత్తనాలు దొరక్క రైతుల అవస్థలు'



మాట్లాడుతున్న సుహాసినిరెడ్డి

ఆదిలాబాద్: విత్తనాలు దొరక్క రైతులు ఇబ్బందులు పడుతున్నా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు చిట్యాల సుహాసిని రెడ్డి ఆరోపించారు. జిల్లా కేంద్రంలోని ఆమె నివాసంలో సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వానాకాలం సీజన్ సమీపిస్తున్న జిల్లాలో రైతులకు అవసరమైన పత్తి విత్తనాలు దొరకక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. రాష్ట్రాన్ని సీడ్ బౌల్ ఆఫ్ ఇండియాగా మారుస్తానని సీఎం కేసీఆర్ గతంలో ప్రకటించారని, అయితే జిల్లాలో రైతులు ప్రస్తుతం విత్తనాల కోసం పడిగాపులు కాయాల్సిన దుస్థితి ఏర్పడుతుందన్నారు. రైతులకు విత్తనాలు దక్కకుండా పలువురు బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా రైతులకు సరిపడా పత్తి విత్తనాలు లభ్యమయ్యేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు జీవిరమణ, క్రాంతి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కోతల నుంచి నిరంతర విద్యుత్ దాకా



మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

- కలెక్టర్ రాహుల్‌రాజ్
- ఘనంగా విద్యుత్ దినోత్సవం

కైలాస్‌నగర్: ఉమ్మడి రాష్ట్రంలో నాడు కరెంట్ కోతలతో సతమతమైన పరిస్థితి నుంచి తెలంగాణ ఆవిర్భవించాక నాణ్యమైన నిరంతర విద్యుత్ అందించే దిశగా రాష్ట్రం విద్యుత్ రంగంలో అభివృద్ధి సాధించిందని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. రాష్ట్ర అవతరణ దశాబ్ది వేడుకల్లో భాగంగా సోమవారం స్థానిక ఎస్టీయూ భవన్‌లో విద్యుత్ దినోత్సవం అట్టహాసంగా నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎమ్మెల్యే జోగు రామన్నతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్రం ఏర్పడిన తరువాత ప్రభుత్వం వ్యవసాయ రంగానికి 24గంటల ఉచిత విద్యుత్ సరఫరా చేస్తుందన్నారు. అలాగే ఏజెన్సీలోని 600 ఆవాసాలకు విద్యుత్ సరఫరాతో పాటు సోలార్ కనెక్షన్ పూర్తయిందన్నారు. రజకులకు, నాయీ బ్రాహ్మణులకు నెలకు 250 యూనిట్ల విద్యుత్ ఉచితంగా అందించడం జరుగుతుందన్నారు. జెడ్పీ చైర్మన్ జనార్దన్ రాథోడ్ మాట్లాడుతూ, విద్యుత్‌శాఖ బలోపేతానికి కృషి చేసిన ప్రతీ ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే రామన్న మాట్లాడుతూ, అమరుల త్యాగాల పునాదులతో ఏర్పడిన తెలంగాణ రాష్ట్రం 24 గంటల విద్యుత్ సరఫరాతో దేశంలోనే గొప్ప ఖ్యాతిని సాధించిందన్నారు. అంతకు ముందు విద్యుత్ రంగంలో చేపట్టిన సంస్కరణలు, సాధించిన ప్రగతి, జిల్లా విద్యుత్ శాఖ స్థితిగతులను ఎస్ఈ సంపత్‌కుమార్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అలాగే కళాకారులు విద్యుత్ వినియోగం, అభివృద్ధిపై పాటలు, నృత్య రూపకంలో నిర్వహించిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ అడ్డి బోజారెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మనోహర్, డీపీవో శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్, డిగ్రీలో చేరేలా శ్రద్ధ వహించాలి

కైలాస్‌నగర్: విద్యార్థులు ఉన్నత స్థానంలో స్థిరపడినప్పుడే ఉపాధ్యాయ వృత్తికి సార్థకత లభిస్తుందని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో విద్యాశాఖ అధికారులతో సోమవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో సబ్జెక్టుల వారీగా నాణ్యమైన విద్యాబోధన చేయాలని సూచించారు. పదో తరగతి పూర్తయిన విద్యార్థులు ఇంటర్మీడియెట్, ఇంటర్ పూర్తయిన వారు డిగ్రీ వంటి కోర్సుల్లో చేరేలా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. అనంతరం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన పెయింటింగ్ పోటీలో గెలుపొందిన విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేసి అభినందించారు. సమావేశంలో ట్రెయినీ అసిస్టెంట్ కలెక్టర్లు పి.శ్రీజ, వికాస్ మహతో, జిల్లా ఇంటర్మీడియెట్ అధికారి రవీందర్, డీఈవో ప్రణీత తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ వెలుగుల్లో తెలంగాణ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు

బోథ్: తెలంగాణ రాష్ట్రం విద్యుత్ కాంతులతో వెలిగిపోతుందని ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావ్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర దశాబ్ది వేడుకల్లో భాగంగా బోథ్ మండలం పొచ్చర క్రాస్‌రోడ్డు వద్ద సాయి కాన్ఫరెన్స్ హాల్‌లో విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. తెలంగాణ రాకముందు కరెంటు కోసం ప్రజలు, రైతులు ఎన్నో కష్టాలు పడ్డారన్నారు. రాష్ట్రం వచ్చిన తరువాత కరెంటు కోతలే లేవన్నారు. రైతులకు 24 గంటల నాణ్యమైన విద్యుత్ అందుతుందన్నారు. అలాగే 33కేవీ విద్యుత్ స్టేషన్లు 13 నుంచి 21కి పెంచామన్నారు. కాగా బోథ్ తహసీల్దార్ అతికొద్దీన్‌ను వేదికపైకి ఆహ్వానించలేదు. పార్టీకి చెందిన నాయకులను వేదికపై ఆహ్వానించి మాట్లాడించారు. ట్రెయినీ కలెక్టర్ వికాస్ మహతోకు కేవలం రెండు నిమిషాలు మాత్రమే మాట్లాడమని సూచించడంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సంధ్యారాణి, విద్యుత్ శాఖ డీఈ హరికృష్ణ, సర్పంచులు మల్లేశ్, సురేందర్, జెడ్పీ కోఆప్షన్ సభ్యులు తాహెర్ బిన్ సలాం, రుక్మాన్‌సింగ్, కిరణ్ కుమార్, నారాయణరెడ్డి, బజార్‌హత్నూర్ ఎంపీపీ జయశ్రీ, బోథ్ ఏఈ వెంకటేశ్ పాల్గొన్నారు.

దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలి

కైలాస్‌నగర్: తమ సమస్యలు పరిష్కరించాలనే డిమాండ్‌తో కలెక్టరేట్ ఎదుట దివ్యాంగులు చేపట్టిన ధర్నా నిరవధికంగా కొనసాగుతుంది. దివ్యాంగుల హక్కు జాతీయ వేదిక ఆధ్వర్యంలో చేపట్టిన ఆందోళనలో భాగంగా సోమవారం వంటావార్పు నిర్వహించి నిరసన తెలిపారు. అక్కడే సామూహిక భోజనాలు చేశారు. వెంటనే పట్టణంలో దివ్యాంగులకాలనీ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



రోడ్డుపైనే భోజనం చేస్తున్న దివ్యాంగులు

అర్జీలు పెండింగ్‌లో ఉంచొద్దు



అర్జీలు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ నటరాజ్

- అదనపు కలెక్టర్ ఎన్.నటరాజ్
- గ్రీవెన్స్‌లో దరఖాస్తుల స్వీకరణ

కైలాస్‌నగర్: ప్రజావాణిలో అందించే అర్జీలు పెండింగ్‌లో ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ బాధితులకు భరోసా కల్పించాలని అదనపు కలెక్టర్ ఎన్.నటరాజ్ ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌లో భాగంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బాధితుల నుంచి అర్జీలు స్వీకరించారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం అర్జీలను సంబంధిత అధికారులకు అందజేస్తూ త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో కలెక్టరేట్ సూపరింటెండెంట్ నలంద ప్రియా, ఎస్సీ, బీసీ సంక్షేమాధికారులు రాజలింగు, సునీత,డీఏవో పుల్లయ్య, ఏపీడీ శేషరావు పాల్గొన్నారు. అర్జీదారుల్లో కొందరి నివేదన వారి మాటల్లోనే..

కలెక్టరేట్ ఎదుట ఆమరణ దీక్ష



ఆమరణ దీక్ష చేపట్టిన గంగన్న

పొన్నారి గ్రామానికి వెళ్లే పాత రెవెన్యూ రహదారిపై బ్రిడ్జి నిర్మించాలని, అలాగే గ్రామంలో అర్హులైన వారికి పింఛన్ మంజూరు చేయాలంటూ ఆ గ్రామానికి చెందిన గంగన్న కలెక్టరేట్ ఎదుట సోమవారం ఆమరణ దీక్ష చేపట్టాడు. గ్రామస్తులతో కలిసి దీక్షకు దిగగా పలువురు మద్దతు తెలిపారు. సమస్యలు పరిష్కారం అయ్యేంత వరకు దీక్ష కొనసాగిస్తానని ఆయన స్పష్టం చేశారు.

ఐదేళ్లయినా భూమి చూపించడం లేదు..



నా పేరిట మండలంలోని బెల్గాం శివారులో గల సర్వేనంబర్ 50/ఆ/2లో ఎకరం, 51/ఆ/2లో రెండెకరాల చొప్పున ఐదేళ్ల కిందట ప్రభుత్వం దళితబస్తీ కింద భూమిని మంజూరు చేసింది. మూడెకరాలకు ధరణి పట్టా కూడా ఇచ్చింది. కానీ ఇప్పటి వరకు రెండెకరాల భూమిని అధికారులు నాకు చూపించనేలేదు. ఐదేళ్లుగా కేవలం ఎకరం భూమిని మాత్రమే సాగు చేసుకుంటున్నం. అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా చేస్తాం.. చూస్తాం అమంటున్నారే తప్ప పట్టించుకోవడం లేదు. న్యాయం చేయాలని దరఖాస్తు ఇచ్చిన.

– భూతం రాధ, బెల్గాం, జైనథ్

పహానీ ఇవ్వడం లేదు..



సర్వేనంబర్ 46/అ2లో నా భార్య పేరిట 1.38 ఎకరాల వ్యవసాయ భూమిని ఎస్సీ కార్పొరేషన్ ద్వారా అప్పటి ప్రభుత్వం 20.06.1998న అందించింది. అప్పటి నుంచి దాన్ని సాగు చేసుకుంటున్నాం. అయితే ఇటీవల పహానీ కోసం మీ సేవ కేంద్రానికి వెళితే ఆ సర్వే నంబర్ వేరే వ్యక్తి పేరిట పహానీ వస్తుంది. దీంతో రైతుబంధు, పంటరుణంతో పాటు భూమిని కోల్పోయే ప్రమాదం ఏర్పడింది. దీన్ని సరిచేసి న్యాయం చేయాలని తహసీల్దార్‌కు పలుమార్లు మొరపెట్టుకున్నా స్పందించడం లేదు. విచారణ జరిపించి న్యాయం చేయాలని కోరుతున్నా.

– లోహకారే సిద్ధార్థ, లక్ష్మీపూర్, జైనథ్

రైతుబంధు అందించాలి



మేమంతా ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజనేతరులం. మా తాత, ముత్తాతల నుంచి ఆ ప్రాంతంలో నివసిస్తూ మాకున్న భూములను సాగు చేసుకుంటూ బతుకుతున్నం. కానీ మాకు భూ ములపై హక్కు లేకపోవడంతో రైతు బంధు, పంట రుణం వంటి ప్రభుత్వ సాయం పొందలేకపోతున్నాం. ఈ విషయంలో ప్రభుత్వం స్పందించి న్యాయం చేయాలని కోరుతున్నాం.

– గిరిజనేతరులు, ఏజెన్సీ ఏరియా

రేషన్ పంపిణీకి బ్రేక్

- సమ్మె బాటలో డీలర్లు
- కమీషన్ బకాయిల విడుదలకు డిమాండ్
- జిల్లాలో నిలిచిన బియ్యం పంపిణీ

జిల్లాలో మొత్తం రేషన్ షాపులు : 356
ప్రస్తుతం ఖాళీగా ఉన్నవి: 10
ప్రతీ నెల కార్డుదారులకు పంపిణీ చేసే బియ్యం : 4000 మెట్రిక్ టన్నులు



డీఎస్‌వోకు సమ్మె నోటీసు అందజేస్తున్న డీలర్లు (ఫైల్)

కైలాస్‌నగర్: జిల్లాలోని రేషన్ డీలర్లు సమ్మెబాట పట్టారు. తమ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలనే డిమాండ్‌తో ఆందోళన బాట పట్టారు. ఈ మేరకు సోమవారం నుంచి జిల్లా వ్యాప్తంగా బియ్యం పంపిణీని నిలిపివేశారు. కాగా జిల్లా రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గతనెల 18న జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి టి.కిరణ్‌కుమార్‌ను కలిసి సమ్మెనోటీస్ అందజేశారు. తమ న్యాయమైన డిమాండ్లను ఈ నెల 4లోపు నెరవేర్చాలని గడువు విధించారు. ఈ క్రమంలో సంఘం రాష్ట్ర నాయకులతో చర్చించిన పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ గడువులోగా సమస్యలను పరిష్కరించకపోవడంతో డీలర్లు సమ్మెకు దిగారు. దీంతో జిల్లాలోని రేషన్ షాపులు తెరుచుకోలేదు. ఫలితంగా పేదలకు సకాలంలో బియ్యం అందని పరిస్థితి.

అందని కమీషన్

ప్రజా పంపిణీ వ్యవస్థ కింద అందించే రేషన్ బియ్యంను డీలర్లు కార్డుదారులకు పంపిణీ చేస్తున్నారు. ఇందుకు గాను డీలర్లకు ప్రభుత్వం క్వింటాల్‌కు రూ.70 చొప్పున కమీషన్ చెల్లిస్తోంది. ఈ మొత్తాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భరిస్తాయి. అయితే కేంద్ర ప్రభుత్వం తన వాటా కింద 2020 ఏప్రిల్ నుంచి మరో రూ.20 కమీషన్ పెంచింది. దీంతో డీలర్లకు రూ.90 కమీషన్ అందాలి. కానీ రాష్ట్ర ప్రభుత్వం వారికి పాత కమీషన్ మాత్రమే చెల్లిస్తుంది. ఈ డబ్బులను జిల్లాలో ఫిబ్రవరి వరకు చెల్లించారు. మార్చి, ఏప్రిల్ నెలలకు సంబంధించినవి పెండింగ్‌లో ఉన్నాయి. అలాగే ఎరియర్స్ కమీషన్ గతేడాది ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు పెండింగ్‌లోనే ఉన్నాయి. వాటిని విడుదల చేయాలని పలుమార్లు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినా ప్రభుత్వం నుంచి స్పందన లేకపోవడంతో సమ్మెబాట పట్టామని డీలర్లు పేర్కొంటున్నారు.

డీలర్ల డిమాండ్లు ఇవే..

- రూ.30వేల నుంచి రూ.40వేల గౌరవ వేతనం ఇవ్వాలి
- రూ.10లక్షల ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలి
- దిగుమతి హమాలీ చార్జీ ప్రభుత్వమే భరించాలి
- ప్రతీ ఎంఎల్ఎస్ పాయింట్‌లో వెయింగ్ బ్రిడ్జిలను ఏర్పాటు చేయాలి
- ప్రతీ రెండేళ్లకోసారి రెన్యూవల్ చేసుకునే అథరైజేషన్‌ను జీవిత కాలానికి జారీ చేయాలి
- క్వింటాల్‌కు ఒకశాతం తరుగు ఇవ్వాలి. దాన్ని ప్రతి నెలా ఈ పాస్ మిషన్ల నుంచి తొలగించాలి.
- కరోనా సమయంలో మృతి చెందిన డీలర్ల స్థానంలో వారి కుటుంబీకులకు అవకాశం కల్పించాలి.
- కారుణ్య నియామకాల గడువు 50ఏళ్లకు పెంచాలి

భారంగా మారుతున్న షాపుల నిర్వహణ

రేషన్ షాపుల నిర్వహణ భారంగా మారుతుందని డీలర్లు చెబుతున్నారు. ఎంఎల్ఎస్ పాయింట్ నుంచి షాపునకు వచ్చే బియ్యంను దిగుమతి చేసుకునేందుకు బస్తాకు రూ.10 చొప్పున హమాలీ చెల్లించాల్సి వస్తోంది. అలాగే షాపులకు పట్టణ ప్రాంతాల్లోనైతే రూ.3నుంచి రూ.5వేలు గ్రామీణ ప్రాంతాల్లో రూ.1000 నుంచి రూ.2వేల వరకు అద్దె చెల్లించాల్సి వస్తోందని చెబుతున్నారు. దీంతో పాటు బియ్యం తూకం వేసి ఇచ్చే వర్కర్‌కు నెలకు రూ.5వేల నుంచి రూ.8వేల వరకు వేతనం చెల్లించాల్సి వస్తోంది. కరెంట్ బిల్లులు సైతం ఇబ్బందిగా మారుతున్నాయని, ఈ క్రమంలో తమ సమస్యలు పరిష్కరించాలని డీలర్లు కోరుతున్నారు.

ప్రభుత్వమే ఆదుకోవాలి



రేషన్ షాపుల నిర్వహణ ఇబ్బందికరంగా మారుతోంది. డీలర్ల సమస్యలు పరిష్కరించాలని 2021లో ప్రభుత్వానికి విన్నవించగా మంత్రులతో సబ్ కమిటీ ఏర్పాటు చేశారు. కానీ ఇప్పటివరకు సమస్యలు పరిష్కరం కాలేదు. కేరళ, గుజరాత్ వంటి రాష్ట్రాల్లో ప్రభుత్వమే డీలర్లతో పాటు వర్కర్‌కు వేతనాలు చెల్లిస్తోంది. షాపులను సైతం కేటాయిస్తుంది. తెలంగాణ ప్రభుత్వం సైతం ఆ దిశగా దృష్టి సారించి డీలర్లను ఆదుకునేలా చర్యలు చేపట్టాలి. ప్రభుత్వం స్పందించే వరకు సమ్మె ఆపేదిలేదు.

– వేణుగోపాల్, డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు

ఫిబ్రవరి వరకు చెల్లించాం



జిల్లాలో రేషన్‌డీలర్లకు సంబంధించిన కమీషన్‌ను ఫిబ్రవరి వరకు చెల్లించాం. మార్చి కమీషన్‌ను లెక్క చేసి వివరాలు కమిషనర్‌కు పంపించాం. అవి రాష్ట్ర కార్యాలయం నుంచి రావాల్సి ఉంది. మరోవైపు డీలర్ల సంఘం రాష్ట్ర ప్రతినిధులతో ప్రభుత్వం చర్చలు జరుపుతుంది. వాటి ఫలితంగా నిర్ణయం వచ్చే అవకాశముంది.

కిరణ్ కుమార్, డీఎస్‌వో

క్లుప్తంగా

పర్యావరణ పరిరక్షణకు చర్యలు



సెమినార్‌లో పాల్గొన్న ముఖరా(కె) సర్పంచ్ మీనాక్షి, ఎంపీటీసీ సుభాష్

ఇచ్చోడ: పర్యావరణ పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ముఖరా(కె) సర్పంచ్ మీనాక్షి, ఎంపీటీసీ సుభాష్ తెలిపారు. ఢిల్లీలో సోమవారం జరిగిన జాతీయ పర్యావరణ సెమినార్‌లో పాల్గొని వారు మాట్లాడారు. పల్లె ప్రకృతివనం, గ్రీన్ ఇండియా చాలెంజ్‌లో భాగంగా ముఖరా (కె) గ్రామంలో లక్ష మొక్కలు నాటినట్లు తెలిపారు. పర్యావరణంలో భాగంగా గ్రామంలో ప్లాస్టిక్‌ను నిషేధించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్, ఎంపీటీసీలను కేంద్ర పర్యావరణశాఖ మంత్రి భూపేందర్‌సింగ్ అభినందించారు.

ట్రాన్స్‌ఫార్మర్‌లో సాంకేతిక లోపం

- కాలిపోయిన టీవీ, ఫ్రిజ్, ఎలక్ట్రానిక్ పరికరాలు



టీవీ నుంచి వస్తున్న పొగలు

బోథ్: మండల కేంద్రంలోని 8, 9, 10వ వార్డులకు విద్యుత్ సరఫరా చేసే ట్రాన్స్‌ఫార్మర్‌లో సాంకేతిక లోపంతో సోమవారం పలు ఇళ్లల్లో 30 టీవీలు, 15 ఫ్రిజ్‌లు, ఎలక్ట్రానిక్ పరికరాలు కాలిపోయాయి. ట్రాన్స్‌ఫార్మర్‌లో న్యూట్రల్ వైరు తెగిపోవడం వల్ల హై ఓల్టేజ్ విద్యుత్ సరఫరా అయిందని అధికారులు పేర్కొన్నారు. కొన్ని ఇళ్లల్లో టీవీలు, ఫ్రిజ్‌ల నుంచి పొగలు రావడంతో ప్రజలు భయాందోళనలకు గురయ్యారు. ట్రాన్స్‌ఫార్మర్ మెయింటెనెన్స్ సరిగా లేకపోవడంతో న్యూట్రల్ వైర్ తెగిపోయిందని కాలనీ వాసులు పేర్కొంటున్నారు. తమకు నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

బెల్లంపల్లిరూరల్: బెల్లంపల్లిలోని ఐటీడీఏ తోట సమీపం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతిచెందాడు. తాళ్లగురిజాల ఎస్సై నరేశ్ కథనం ప్రకారం.. బెల్లంపల్లి మున్సిపాలిటీ అంబేద్కర్ రడగంబాల బస్తీకి చెందిన ఎండీ హుస్సేన్(40) పాత ఇనుప సామగ్రి కొనుగోలు వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. రోజు వారీగా సోమవారం సాయంత్రం తన బైక్‌పై బెల్లంపల్లి నుంచి గురిజాల వైపు వెళ్తున్నాడు. ఈ క్రమంలో కన్నెపల్లి నుంచి బెల్లంపల్లికి వస్తున్న కారు బైక్‌ను ఎదురుగా వేగంగా ఢీకొంది. ఒక్కసారిగా హుస్సేన్ కిందపడి తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. కారును అక్కడే వదిలి డ్రైవర్ పరారయ్యాడు. ప్రమాద ఘటనపై సమాచారం అందుకున్న పోలీసు సిబ్బంది అక్కడికి చేరుకుని హుస్సేన్ మృతదేహాన్ని బెల్లంపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య, ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉంది. కుటుంబసభ్యుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గోదావరి ఒడ్డున మొసలి సంచారం

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలోని గోదావరి ఒడ్డున మొసలి సంచరిస్తోంది. సామిల్ వెనుకాల నీటి గుంత పక్కన మూడు రోజులుగా మొసలి సంచరిస్తూ జాలరుల కంట పడింది. అటు వైపు నుంచి గోదావరికి చేపల వేటకు వెళ్లే వారు వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్టు చేశారు. దీంతో మొసలి సంచారం విషయం వైరల్‌గా మారింది. ఫారెస్టు అ.ధికారులు స్పందించాలని ప్రజలు కోరుతున్నారు.

నష్టాల నుంచి లాభాల్లోకి..



మంచిర్యాల బస్‌స్టేషన్‌లో ఆర్టీసీ బస్సులు

- ఆర్టీసీకి కలిసొచ్చిన వేసవి సెలవులు
- శుభకార్యాలు, విహారయాత్రలకు నడిపిన బస్సులు

మంచిర్యాలఅర్బన్: నష్టాల్లో ఉన్న ఆర్టీసీ సంస్థ మే నెలలో లాభాల బాట పట్టింది. గతేడాది మే నెలతో పోల్చితే రూ.7.87 కోట్ల ఆదాయంతో ప్రగతి చక్రం ముందుకు సాగింది. వేసవి సెలవులు ఆర్టీసీకి కలిసివచ్చింది. ఉమ్మడి జిల్లాలో మే నెలలో 78లక్షల 30వేల కి.మీ మేర బస్సులు తిప్పగా గతేడాది కంటే రూ.7.87 కోట్లు లాభాలు వచ్చాయి. ఇతర నెలలతో పోల్చితే మేలో ఆర్టీసీకి ఆదాయం వస్తుందని అంచనా వేసిన ఆర్టీసీ అందుకు తగినట్లుగా బస్సులు తిప్పింది. పెళ్లిళ్లు, విహారయాత్రలు శుభకార్యాలు నేపథ్యంలో ప్రణాళిక ప్రకారం బస్సులను నడపటంతో ఆశించిన మేర లాభాలు వచ్చాయని ఆర్టీసీ రీజినల్ మేనేజర్ జానీరెడ్డి తెలిపారు.

మే నెలలో ఆదాయం (రూ.కోట్లలో)

డిపో	2022	2023
ఆదిలాబాద్	6.45	8.06
భైంసా	3.18	4.05
నిర్మల్	7.19	8.96
ఉట్నూర్	1.11	1.56
ఆసిఫాబాద్	3.40	4.41
మంచిర్యాల	16.80	18.52
మొత్తం	27.74	35.61

(మే నెలకు సంబంధించి)

డిపో	ఓఆర్ 2022	తిప్పిన బస్సులు 2023	కిలోమీటర్లు (లక్షల్లో) 2022	2023
ఆదిలాబాద్	79	74	16.51	17.11
భైంసా	79	71	8.91	9.52
నిర్మల్	79	72	18.21	19.44
ఉట్నూర్	81	62	3.17	3.72
ఆసిఫాబాద్	74	69	9.37	9.99
మంచిర్యాల	78	71	16.80	18.52

ఓఆర్ తగ్గినా పెరిగిన ఆదాయం..

గతేడాది మే నెలతో సరిచూస్తే ఈ ఏడాది ఆక్యుపెన్సీ రేషియో(ఓఆర్) తగ్గిపోయింది. గతేడాది 78 ఓఆర్ ఉండగా, ఈ ఏడాది 71 పడిపోయిన ఆదాయంపై ప్రభావం పడలేదు. ఆదిలాబాద్ డిపో 74 శాతం ముందు వరుసలతో నిలిచింది. నిర్మల్ డిపో 72 శాతంతో రెండో స్థానం నిలవగా, భైంసా డిపో, మంచిర్యాల 71 శాతంతో మూడో స్థానానికి పరిమితమైంది. ఆదిలాబాద్ రీజియన్‌వ్యాప్తంగా ఈ ఏడాది మే నెలలో 78 లక్షల 30 వేల కి.మీ మేర బస్సులు నడిపి 71శాతం ఓఆర్‌తో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. గత మే నెలతో పోల్చితే ఈ ఏడాది ముందు వరుసలో నిలిచిన ఆదిలాబాద్, నిర్మల్ డిపో 3 శాతం, మంచిర్యాల 6 శాతం వెనకబడిపోవటం గమనార్హం. గతేడాది 72 లక్షల 96 కి.మీ బస్సులు నడపగా ఈ ఏడాది 78 లక్షల 30 వేల కి.మీ మేర బస్సులు తిప్పి ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చడం ద్వారా అనుకున్నమేర కంటే ఆదాయం గడిచింది.

పెరిగిన ఈపీకే..

ప్రతి కిలోమీటర్‌కు వచ్చిన ఆదాయం పోల్చితే ఈ ఏడాది మే నెలలో ఆశించిన దానికంటే మెరుగ్గానే ఉంది. రీజియన్‌లో చూస్తే గతేడాది మే నెలలో 38.03 ఎర్నింగ్ ఫర్ కిలోమీటర్ (ఈపీకే) కాగా, ఈసారి 45.48 మేర ఈపీకేతో ఆర్టీసీ దూసుకెళ్లింది. ఆదిలాబాద్ 47.12, నిర్మల్ డిపో 46.10, మంచిర్యాల 46.11 ఈపీకేతో మూడో స్థానానికి పరిమితమైంది. కుమురంభీం ఆసిఫాబాద్ 44.24, భైంసా 42.62, ఉట్నూర్ డిపో 42.10తో ఈపీకేలో తర్వాత స్థానం నిలిచాయి. గతేడాది మేనెలతో పోల్చితే మాత్రం 7.45 ఈపీకేతో అదనం లాభాలు గడిచింది.

స్పందించారు.. సాయమందించారు



ఆర్థికసాయం అందిస్తున్న స్నేహితులు

సాక్షి స్పందన

బోథ్: మండలంలోని గుర్రాల తాండ గ్రామంలో దీనస్థితిలో ఉన్న కుటుంబంపై ఈనెల 3న సాక్షిలో 'ఇంటికి పెద్ద..ఆ చిన్నారి' కథనానికి మానవతావాదులు స్పందిస్తున్నారు. బోథ్ మండల కేంద్రానికి చెందిన 1990–91వ బ్యాచ్ స్నేహితులు బాధిత కుటుంబానికి నిత్యావసర సరుకులతోపాటు రూ.10,400లను సోమవారం అందించారు. మణిచంద్ర ఫౌండేషన్ సభ్యులు కుటుంబానికి ఫ్యాన్‌తోపాటు సరుకులు, కొంత మంది ఫోన్‌పే ద్వారా నగదు అందించారు. కత్తూరి విశ్వనాథ్, అల్లకొండ పోతన్న, కొట్టూరి సత్యనారాయణ, బృహస్పతి, గులాబ్ సింగ్, మణిచంద్ర ఫౌండేషన్ చైర్మన్ నాంపల్లి చంద్రమోహన్, సాయిని గంగాధర్, భరత్‌కుమార్ ఉన్నారు.

యువతి అదృశ్యం

నిర్మల్‌రూరల్: జిల్లాకేంద్రంలోని మంజులాపూర్‌కు చెందిన ఓ యువతి అదృశమైనట్లు రూరల్ ఎస్సై చంద్రమోహన్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం .. జైల రజిత(30) సోమవారం ఉదయం ఇంట్లో ఎవరికి చెప్పకుండా బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు, బంధువుల ఇళ్లలో, చుట్టుపక్కల గాలించిన ఫలితం లేకపోయింది. దీంతో రూరల్ పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వివరించారు.

అంబరాన్నంటిన క్రీడా సంబరం



మైదానంలో ఆయా జిల్లాల క్రీడాకారులు

- రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలు ప్రారంభం
- ఎనిమిది జిల్లాల జట్లు హాజరు

రామకృష్ణాపూర్: మంచిర్యాల జిల్లా రామకృష్ణాపూర్ పట్టణంలోని ఠాగూర్ స్టేడియంలో తెలంగాణ రాష్ట్రస్థాయి బాలికల ఫుట్‌బాల్ పోటీలు సోమవారం సాయంత్రం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. మరో రెండు రోజులపాటు జరిగే ఈ పోటీలకు ఎనిమిది జిల్లాల నుంచి క్రీడాకారులు హాజరయ్యారు. పోటీలకు అంతర్జాతీయ క్రీడాకారుడు, రాష్ట్ర ఫుట్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఫాల్గుణ, డీవైఎస్‌ఓ శ్రీకాంత్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై వివిధ జిల్లాల జట్ల గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా క్రీడాకారుల మార్చ్ ఫాస్ట్ ఆకట్టుకుంది. వివిధ రాష్ట్రాల కెప్టెన్‌లతో ప్రతిజ్ఞ చేయించిన అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. క్రీడల్లో గెలుపోటములను లెక్కచేయకుండా అకుంఠిత దీక్షతో సాధన చేస్తే మంచి క్రీడాకారులుగా ఎదుగుతారని వక్తలు అభిప్రాయపడ్డారు. ఫుట్‌బాల్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పిన్నింటి రఘునాథ్‌రెడ్డి, సీనియర్ క్రీడాకారులు సంజయ్, ఈశ్వరాచారీ తదితరులు పాల్గొన్నారు.

మంచిర్యాల జట్టు శుభారంభం..

లీగ్ కమ్ నాకౌట్ పద్ధతిలో నిర్వహిస్తున్న ఫుట్‌బాల్ పోటీల్లో ఆతిథ్య మంచిర్యాల జట్టు శుభారంభం చేసింది. ఉదయం నిర్వహించిన పోటీల్లో కోర్ట్ నంబరు–2లో జరిగిన లీగ్ మ్యాచ్‌లో వనపర్తి జిల్లాపై మంచిర్యాల జట్టు 4–0 గోల్స్‌తో విజయం సాధించింది. మరో లీగ్‌లో నిజామాబాద్ జట్టు మహబూబ్‌నగర్‌పై 6–0 గోల్స్‌తో గెలుపొందింది. కోర్ట్ నెంబర్–1లో జరిగిన పోటీల్లో నల్గొండ జట్టు రంగారెడ్డిపై 2–0 గోల్స్‌తో, మెదక్ జట్టు ఖమ్మంపై 1–0 గోల్స్‌తో గెలుపొందాయి.

పట్టగొలుసు మింగిన చిన్నారి

- బయటకు తీసిన వైద్యులు
- తప్పిన ప్రాణాపాయం



వెలికితీసిన పట్టగొలుసు

నిర్మల్‌ఖిల్లా: ఆరునెలల చిన్నారి ఆటలాడుకుంటూ కాలి పట్టిని మింగేయగా వైద్యులు చిన్నారి కడుపులో నుంచి బయటకు తీసి ప్రాణాపాయం నుంచి కాపాడారు. వివరాల్లోకెళ్తే.. సోమవారం సారంగపూర్ మండలం బండ్రేవు తండా గ్రామానికి చెందిన ఆరునెలల చిన్నారి ఆటలాడుకుంటూ కాలి పట్టగొలుసును మింగేసింది. గమనించిన కుటుంబీకులు జిల్లాకేంద్రంలోని స్థానిక ప్రశాంత్ జీకే హాస్పిటల్‌కు తీసుకెళ్లారు. వైద్యుడు ప్రశాంత్ తన బృందంతో కలిసి పరీక్షలు చేయగా, గొలుసు కడుపులో ఉన్నట్టు నిర్ధారించారు. నియోనాటల్ ఎండోస్కోపీ చికిత్స ద్వారా పట్టగొలుసుని తొలగించడంతో ప్రాణాపాయం తప్పింది. చిన్నారి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు వైద్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

అర్జీలు సత్వరం పరిష్కరించాలి

- ఐటీడీఏ డీడీ దిలీప్‌కుమార్



అర్జీలు స్వీకరిస్తున్న దిలీప్‌కుమార్

ఉట్నూర్‌రూరల్: అర్జీలను సత్వరం పరిష్కరించాలని ఐటీడీఏ డీడీ డా.దిలీప్‌కుమార్ పేర్కొన్నారు. ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయ సమావేశమందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ఆయన గిరిజనుల అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా దిలీప్‌కుమార్ మాట్లాడుతూ గిరిజనుల సమస్యలను పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. అర్జీలను శాఖల వారీగా పరిష్కరించి న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీవో జనరల్ కనక భీంరావు, ఏపీవో పీవీటీజీ ఆత్రం భాస్కర్, ఏవో రాంబాబు, జేడీఎం నాగభూషణ్, బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ మనోహర్, డీపీవో ప్రవీణ్, మేనేజర్ లింగు, ఐటీడీఏ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

- ఆర్వోఎఫ్ఆర్ పట్టా మంజూరు చేయాలని ఆదిలాబాద్ మండల పిప్పలాదరి గ్రామానికి చెందిన ఆత్రం అయ్యు, జంగు విన్నవించారు.
- తనకు ఉద్యోగం ఇప్పించాలని ఉట్నూర్ మండలం హనుమాన్‌నగర్‌కు చెందిన సట్ల మమత వేడుకుంది.
- ఆశ్రమ పాఠశాలలో ఉద్యోగం ఇప్పించాలని బజార్‌హత్నూర్ మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన కుడిమెత గంగాసాగర్ అర్జీ సమర్పించాడు.
- తనకు వికలాంగుల ట్రైసైకిల్, ఇల్లు మంజూరు చేయాలని ఉట్నూర్ మండలం శంకర్‌నాయక్ తండాకు చెందిన జె.మమత కోరింది.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

- దుకాణ సముదాయం పనులు ఆపాలంటూ అఘాయిత్యం
- ఒంటిపై కిరోసిన్ పోసుకోగా, అడ్డుకున్న పోలీసులు
- విధులకు ఆటంకం కలిగించారని కేసు



ఒంటిపై కిరోసిన్ పోసుకుని ఆత్మహత్యాయత్నం చేస్తున్న మహబూబ్‌ఖాన్, అడ్డుకుంటున్న పోలీసులు

భైంసాటౌన్: పట్టణంలోని వ్యవసాయ శాఖ కార్యాలయ సమీపంలో చేపడుతున్న దుకాణ సముదాయ పనులు ఆపాలంటూ పట్టణానికి చెందిన మహబూబ్ ఖాన్ సోమవారం ఆత్మహత్యకు యత్నించాడు. వివరాలిలా ఉన్నాయి.. సర్వేనంబర్ 330లో తమకు చెందిన భూమిని ప్రభుత్వ భూమిగా చూపి మున్సిపల్ అధికారులు దుకాణ సముదాయం నిర్మిస్తున్నారని, పనులు నిలిపేయాలంటూ కొద్దిరోజులుగా మహబూబ్‌ఖాన్ కుటుంబీకులు అక్కడే బైఠాయించి డిమాండ్ చేస్తున్నారు. సోమవారం పనులు అడ్డుకోగా, అధికారులు పోలీసులకు సమాచారమిచ్చారు. వారు అక్కడికి వచ్చి సముదాయించినా వినిపించుకోలేదు. తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి అక్కడికి చేరుకుని వారితో మాట్లాడారు. పనులు అడ్డుకోవడం తగదని, ఏదైనా ఉంటే కోర్టు ద్వారా తేల్చుకోవాలని సూచించారు. ఇంతలో మహబూబ్‌ఖాన్ ఒంటిపై కిరోసిన్ పోసుకుని ఆత్మహత్యకు యత్నించాడు. వెంటనే అప్రమత్తమైన పోలీసులు అడ్డుకున్నారు. అనంతరం వారిని అక్కడి నుంచి పంపివేశారు. కాగా, విధులకు ఆటంకం కలిగించారని మున్సిపల్ అధికారుల ఫిర్యాదు మేరకు మహబూబ్‌ఖాన్, జాకీర్ అహ్మద్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ ఎల్.శ్రీను తెలిపారు.

తమ్ముడిని హత్యచేసిన అన్నకు జీవితఖైదు

- రూ.5 వేల జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి తీర్పు

నిర్మల్‌టౌన్: సొంత తమ్ముడిని హత్యచేసిన అన్నకు జీవిత ఖైదుతోపాటు జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి కర్ణకుమార్ సోమవారం తీర్పునిచ్చారు. కోర్టు సమన్వయల అధికారి సక్రియ నాయక్ తెలిపిన వివరాలు.. తానూర్ మండలం జల్వా (కె) గ్రామానికి చెందిన నేరస్తుడైన ఇప్తేకర్ దత్తు, మృతుడు ఇప్తేకర్ శంకర్ (32) అన్నదమ్ములు. ఒకే ఇంట్లో పక్కపక్క పోర్షన్‌లో ఉండేవారు. వీరి తండ్రి గంగాధర్ తన ఇద్దరు కుమారులకు చెరో ఆరు ఎకరాల పంట భూమిని ఇచ్చాడు. ఇద్దరికి బోరుబావిని ఏర్పాటు చేశాడు. గంగాధర్‌కు నాలుగెకరాల భూమి, బోరు బావి ఉంది. ఇద్దరు కుమారులకు ఇచ్చిన భూమిలో బోరు బావి నీళ్లు ఉండడం లేదు. తండ్రి గంగాధర్ బోరు బావి నుంచి అప్పుడప్పుడు పంట కోసం నీళ్లు ఉపయోగించేవారు. ఈ విషయమై అన్నదమ్ములకు గొడవలు జరుగుతుండేవి. గ్రామ పంచాయతీలో తండ్రి పంచాయితీ పెట్టాడు. కుమారులకు చెరో వారం బోరుబావి నీళ్లు వాడుకోవాలని ఒప్పందం కుదిరింది. కొన్నిరోజుల తర్వాత 2018 మార్చి 20న రాత్రి నేరస్తుడైన దత్తు ఇంటి ముందు కూర్చొన్నాడు. వేరుశనగ పంట ఎండిపోతుందని, తండ్రి బోరు నీళ్లను ఉపయోగించుకుంటానని శంకర్ అడిగాడు. దత్తు ఒప్పుకోకపోవడంతో శంకర్‌ను ఇంట్లోకి తీసుకెళ్లి రక్తం వచ్చేలా తీవ్రంగా కొట్టడంతో కింద పడిపోయాడు. తల్లిదండ్రులు, భార్య అతన్ని భైంసా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మార్చి 21న మృతిచెందాడు. మృతుడి భార్య పూజ ఫిర్యాదుతో అప్పటి తానూర్ ఎస్సై జి. రాజన్న కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. అప్పటి సీఐ శ్రీనివాస్ నేరస్తుని అరెస్టు చేసి చార్జీషీట్ దాఖలు చేసి కోర్టులో హాజరుపర్చాడు. పీపీ వినోద్‌రావు 20 మందిని సాక్షులను ప్రవేశపెట్టి నేరం రుజువు చేయడంతో దత్తుకు జీవిత ఖైదుతోపాటు రూ.5 వేల జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి తీర్పునిచ్చారు.

వడదెబ్బతో ఒకరి మృతి?

బెల్లంపల్లిరూరల్: వడదెబ్బతో ఒకరు మృతి చెందిన ఘటన బెల్లంపల్లి మండలంలో చోటుచేసుకుంది. తాళ్లగురిజాల ఎస్సై నరేశ్ కథనం ప్రకారం.. బెల్లంపల్లి మున్సిపాలిటీ హనుమాన్ బస్తీకి చెందిన ఎర్రోజ్ అశోక్‌కుమార్(40) బంగారు ఆభరణాలు తయారు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. గతకొన్ని నెలలుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఇదే క్రమంలో మద్యానికి బానిసయ్యాడు. ఈనెల 1న ఇంట్లో నుంచి బయటకు వెళ్తున్నాని చెప్పి వెళ్లాడు. రెండురోజుల తర్వాత ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు బంధువుల ఇళ్లల్లో, ఇతర ప్రాంతాల్లో ఆచూకీ కోసం వెతికినా దొరకలేదు. సోమవారం బెల్లంపల్లిలోని పోచమ్మ చెరువు సమీపంలోని ముళ్లపొదల్లో ఉన్న మృతదేహాన్ని అశోక్‌గా గుర్తించారు. ఎస్సై అక్కడి చేరుకుని పంచనామా నిర్వహించారు. అశోక్‌కు అనారోగ్యం ఉండడం, తిండి తినపోకవడంతో వడదెబ్బకు గురై మృతిచెంది నట్లు ప్రాథమికంగా నిర్ధారించారు. మృతుడికి భార్య లావణ్య, పదేళ్ల కుమారుడు మణికంఠ, ఆరేళ్ల కుమార్తె శివాణి ఉన్నారు. భార్య, కుటుంబీకుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ప్రకృతి వనరులను సంరక్షించాలి



మొక్క నాటుతున్న ఉద్యాన అధికారి సందీప్‌కుమార్

ఉట్నూర్‌రూరల్: ప్రకృతి వనరులను నిత్యం సంరక్షించాలని, కలుషితం లేని గాలి, నీరును భావి తరాలకు అందించడానికి అందరూ కలిసి నడవాలని ఐటీడీఏ ప్రాజెక్టు ఉద్యాన అధికారి (పీహెచ్ఓ) గుడిమళ్ల సందీప్‌కుమార్ పేర్కొన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని తుకారాంనగర్‌లో సీపీఎఫ్ ఆధ్వర్యంలో రైతులకు ప్రకృతి వ్యవసాయం తదితర అంశాలపై సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐటీడీఏ పరిధిలోని నర్సరీల్లో మామిడి, కొబ్బరి, బొప్పాయి, మునగ మొక్కలు తక్కువ ధరకు ఈ సంవత్సరం నుంచి అందుబాటులో ఉంటాయని తెలిపారు. రైతులు ఆర్థికాభివృద్ధి పొందాలంటే త్వరగా ఆదాయానిచ్చే కూరగాయాలు, బొప్పాయి, మునగ పంటలు సాగు చేపట్టాలన్నారు. అనంతరం గ్రామాల్లో మొక్కలు నాటారు. సర్పంచ్ రేణుకాబాయి, సీపీఎఫ్ ప్రతినిధులు సత్యనారాయణ, రవి, మంగ, జ్ఞాను, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆర్జీయూకేటీలో..

భైంసాటౌన్: బాసర ఆర్జీయూకేటీలో సోమవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ వెంకటరమణ, డైరెక్టర్ సతీశ్ కుమార్ క్యాంపస్‌లో మొక్కలు నాటి నీరు పోశారు. అనంతరం మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణపై వివరించారు.





బాసర ఆలయంలో పూజలు

భైంసాటౌన్: బాసర శ్రీజ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయంలో మూలనక్షత్రం పూజలో భాగంగా సోమవారం అమ్మవారి ఉత్సవ మూర్తికి విశేష అభిషేకాది పూజలు నిర్వహించారు. అర్చకుల వేద మంత్రోచ్ఛరణల మధ్య కలశపూజ, గణపతి పూజ, సరస్వతి పూజ, కుంకుమార్చన చేపట్టారు. బాసర అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.